క్లుప్తంగా

ఘనంగా ఆరాధన పూజలు



మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో బాలయోగి శివనారాయణస్వామి ఆశ్రమంలో గురువారం ఆరాధన పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



ధరూరు: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చని ఫీల్డ్ అధికారి శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నీలహళ్లి గ్రామంలో రైతు వెంకటరాజారెడ్డి పొలంలో సాగు చేసిన పామాయిల్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నడిగడ్డ ప్రాంతంలోని పంట పొలాలు పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పామాయిల్ సాగుపై ప్రభుత్వ రాయితీ తదితర అంశాలు వివరించారు. పండించిన పంటను ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయండి



అయిజ: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిడికెడు మందితో మందితో ప్రారంభించారన్నారు. ఉద్యమంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శివకుమార్, వీరేష్, తిరుమల్, లతీఫ్, శేఖర్‌గౌడ్, వాజీద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు గ్రామంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు సోమనాద్రి లబ్ధిదారులు జింకలపల్లి గ్రామానికి చెందిన సిద్దేశ్వర్‌రెడ్డికి రూ.34,000, బోయపెద్ద బీచుపల్లికి రూ.27,900 విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, బీచుపల్లి, హనుమంతు, నారాయణ, సవరన్న, సిరాజ్, యోహాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి



ధరూరు: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని డీఏఓ సక్రియానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువులు మందుల దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి దుకాణం వద్ద విధిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఇచ్చే ఎరువులపై మందులకు సంబంధించి ఈ పాస్ పద్ధతిన ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయాలు జరిపినా, నాణ్యత లేని ఎరువులు అమ్మినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత పాల్గొన్నారు.

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

- డంపింగ్ యార్డుల్లో చెత్త కాల్చివేత
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది



చిన్నపోతులపాడు గ్రామంలోని డంపింగ్‌యార్డులో చెత్త కాలుస్తున్న దృశ్యం(ఫైల్)

మానవపాడు: ప్రభుత్వం గ్రామాలను పారిశుద్ధ్య కొరల నుంచి రక్షించడానికి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో డంపింగ్ యార్డుల్లో చెత్త కాల్చివేస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. పొంతన లేని సమాధానాలతో డంపింగ్ యార్డుల్లో చెత్త కాలిపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపియ్యటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనిభారం తగ్గించుకునేందుకు దహనం..

గ్రామాల్లో రోజు వారీగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. ఏరోజు ఎన్ని ట్రిప్పుల చెత్త సేకరించారనే వివరాలు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. సేకరించిన చెత్త నుంచి పొడి చెత్తగా గుర్తించిన ఇనుము, ప్లాస్టిక్, గాజు తదితర వస్తువులను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచాలి. తడి చెత్త ద్వారా తయారయ్యే వర్మీ కంపోస్ట్ విక్రయం ద్వారా రెండు విధాలుగా వచ్చే ఆదాయాన్ని ఎలా వినియోగించుకోవాలి. ఈ విధానం ద్వారా పలువురికి ఉపాధి కల్పించవచ్చనే విధి విధానాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ గతంలో సూచనలు చేశారు. ఇదంతా నిర్వహించడం భారమవుతుందనే ఆలోచనతో ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తతో పాటు వీధుల్లోని పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలో తరలించి డంపింగ్‌యార్డులో దహనం చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల ఆదేశాలను పట్టించుకుండా గ్రామాల్లోని డంపింగ్ యార్డులోనే చెత్త కాలుస్తున్నారు. అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కళ్ల ఎదుటనే చెత్తను డంపింగ్‌యార్డులో కాల్చివేస్తున్నా ఇంతవరకు ఒక్క గ్రామ పంచాయతీ డంపింగ్‌యార్డుపై చర్య తీసుకోవకపోవడం విడ్డూరమని ప్రజలు ఆరోపిస్తున్నారు. లక్షలు వెచ్చించారూ.. లక్షణంగా వదిలేస్తున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారడమే కాకుండా ప్రజాధనం వృథా అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని ఏఏ గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో చెత్తను కాలుస్తున్నారో వారిపై చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తాం.

–భాస్కర్ ఎంపీడీఓ, మానవపాడు

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అయిజ: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం వీధిలైట్లు సక్రమంగా ఉండే విధంగా పనిచేస్తారన్నారు. గ్రామాలకు సేవలు చేసే కార్మికులకు గత ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, రెండో పీఆర్‌సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ కార్మికులను తీసుకోవాలని, ప్రమాదబీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బతకన్న, ప్రధాన కార్యదర్శి రాజు, కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

అయిజ: మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 139వ మేడే సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేసి, దేశంలో ఉన్న 50 కోట్ల మంది కార్మికుల సమస్యలు పరిష్కరించవలసిన బాధ్యతను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, దానయేలు, ఈరన్న, ఆంజనేయులు, శాంతిరాజు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



భీంపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈఓ స్వరూప



మల్దకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

రాజోళి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతు వేదికలో ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. జొన్నలు క్వింటాకు రూ.3,370 ప్రభుత్వం అందిస్తుందని, ఎకరాకు 14 క్వింటాళ్ల మాదిరిగా కొనుగోలు చేసే వెసలుబాటు ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, జైరెడ్డి, గంగిరెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల పరిధిలోని భీంపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వరూప, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, సింగిల్ విండో కార్యాలయ సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం వరికి కనీస మద్దతు ధర రూ.2320లతో పాటు అదనంగా మరో రూ.500 అందజేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్సులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఖాజాపాష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ధరూరులో విద్యార్థిని అభినందిస్తున్న నాయకులు



రాయాపురంలో అభినందిస్తున్న ఎస్‌ఐ మల్లేష్

గట్టు: మండలంలోని రాయాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లావణ్య ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంపై విద్యార్థినితో పాటు తల్లి నంస్వమ్మలను ఎస్‌ఐ మల్లేష్ గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థినికి రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు గాను 439 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బుడ్డన్న, భీమేష్, మాజీ ఎంపీటీసీ రంగస్వామి, గ్రామస్తులు వెంకటేష్, కర్రెప్ప, తాయప్ప, పాగుంటప్ప పాల్గొన్నారు.

ధరూరు: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండల కేంద్రానికి చెందిన ఇర్ఫాన్‌ను టీపీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కురువ రవి, యూత్ రవి కుమార్, నీరజ్, జునైద్, రాజు అభినందించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 470కి 468 మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



చంద్రశేఖర్‌నగర్‌లో ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

మల్దకల్ : మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ సూచించారు. గురువారం గ్రామంలో ఇళ్ల మంజూరైన లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. త్వరతగతిన నిర్మాణం పూర్తయ్యేలా అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సత్వరమే బిల్లులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆర్థికసాయం..

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేశారు. మహిళా సమైఖ్య గ్రూపు సభ్యులు భూదేవి, ప్రభామ్మ, రాములమ్మకు ఒక్కొక్కరికి రూ. లక్ష అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వచ్చేనెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా హామీ ఇచ్చారన్నారు. అయితే మే నెల సమీపిస్తున్నప్పటికీ అందుకు సంబంధించిన జీఓ జారీ చేయకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నూతన విద్యావిధానాన్ని అంగన్‌వాడీలో ప్రవేశపెట్టవద్దని, ఎంఈపీని రద్దు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అదనపు బాధ్యతలు నిర్వరిస్తున్న టీచర్లకు ఇన్‌చార్జి అలవెన్సులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి సరోజ, గౌసియా, సుగుణ, సువర్ణ, గౌస్య, నర్సమ్మ ,రేణుక, చంద్రకళ, లక్ష్మి, రాజ్యలక్ష్మి, నాగమణి, లీల ప్రభావతి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో వెలసిన ఉభయలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం, ఉభయలింగేశ్వరాస్వామి మూల విగ్రహాల ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఆధ్వర్యంలో వేడుకలు కనులపండువగా జరిపించారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేయడమే లక్ష్యం



రాజోళి: ప్రజలకు సేవ చేయడమే చిరంజీవి ఫ్యాన్స్ లక్ష్యమని చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ పి.రామ్మోహన్ ప్రారంభించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం శుభ పరిణామమని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, వీరేష్ తదిదరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకురాలు బాసు శ్యామల హన్మంతునాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాదరస్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి



యువకులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

గట్టు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. గురువారం ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గట్టు, కేటిదొడ్డి మండలాలకు చెందిన వెనుక బడిన విద్యార్థులను గుర్తించి, విద్యలో మెళకువలు నేర్పించే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవిలో విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు గట్టు, కేటిదొడ్డి మండలాల్లోని 100 మంది యువకులు ముందుకొచ్చినట్లు ఎంవీఎఫ్ సంస్థ సభ్యులు తెలిపారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌లు కర్రెప్ప, పరుశరాములు విద్యార్థులకు గణితం, తెలుగు సబ్జెక్టులను ఏ విధంగా నేర్పించాలనే అంశంపై వివరించారు. వేసవిలో 40 రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో కేటిదొడ్డి బాలల హక్కుల సంరక్షణ వేదిక నుంచి ఈరన్న, గట్టు మండల కన్వీనర్ ఆంజనేయులు, యువకులు పాల్గొన్నారు.

దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలు



మొక్కలు నాటుతున్న పవన్‌కుమార్

మానవపాడు: దేశానికి పటుగొమ్మలు గ్రామాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో గురువారం ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, సమావేశంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని వేణిసోంపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మోడల్ గ్రామ పంచాయతీ క్లస్టర్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ పవన్ కుమార్, కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడారు. 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హక్కు లభించిందన్నారు. పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం వేసవి క్రీడా శిబిరాన్ని జీహెచ్ఎం నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పొందవచ్చన్నారు.నేటి సమాజంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పీఈటీ ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో ఆరాధన మహోత్సవ పూజ కార్యక్రమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. 11:30 గంటలకు స్వామివారి అష్టోత్తరం, భజన చేశారు. 12:30 నారాయణ సేవలో భాగంగా అన్నదానం చేపట్టారు. సాయంత్రం భజన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు.



ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



రాజోళిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు



అలంపూర్ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



ఉండవెల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నాయకులు

అలంపూర్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి కోర్టు నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనివాసులు, న్యాయవాదులు నారాయణరెడ్డి, నాగరాజుయాదవ్, తిమ్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాజీ ఏజీపీ నరసింహ్మా, వెంకటేష్, గజేంద్రగౌడ్, మహానంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: కశ్మీరులో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని మండల బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ అల్వలపాడు ప్రతాప్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అల్వలపాడు గ్రామంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మన్యపురెడ్డి, గోపాల్, సీకే గోపాల్, అంజి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన మారణకాండలో అసువులు బాసిన వారికి మండల కేంద్రంలో పార్టీలకతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. సమైక్యతా భావంతో జీవిస్తున్న దేశంలో మతాల వారిగా దాడులు చేసి, కల్లోలాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఊరవాకిలి వరకు కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గ్రామ పెద్దలు, యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ చాలీసా సంఘం సభ్యులు, బీజేపీ, హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.